క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: కిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని బాపుబాగ్, డీవీ కాలనీ విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ ఏడీఈ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంట నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కృష్ణానగర్, సిద్ధివినాయక, పీజీ రోడ్డు, ఫుడ్ వరల్డ్, మారుతి కన్‌స్ట్రక్షన్, గణేష్ నిమజ్జన ప్రాంతం, పోచంపల్లి ఎదురు ప్రాంతం, సింధికాలనీ, ఎయిర్‌లైన్స్ టవర్, పీజీ రోడ్డు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు డీవీ కాలనీ, జవహర్ నగర్ కాలనీ, గార్డెన్ ఏరియా, డీవీ హౌస్ 1, 2, 3, రామాలయ టెంపుల్, కిమ్స్ హాస్పిటల్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్ల వంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 55, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 37, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 23, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 25, దోసకాయ 28, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 23, చామగడ్డ 55, మొరంగడ్డ 23, కందగడ్డ 25, సొరకాయ 15, పొట్లకాయ 13, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4-6, ముల్లంగి 3-5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు ఉంటాయి.

మద్యం దుకాణంలో విద్యుదాఘాతం

బౌద్ధనగర్: విద్యుదాఘాతంలో వారాసిగూడలోని బీవైటీ మద్యం దుకాణంలో మంటలు చెలరేగిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అప్రమత్తమైన నిర్వాహకులు వెంటనే మెయిన్ ఆఫ్ చేసి బయటకు రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఓ ఫ్రిడ్జ్‌తో పాటు పలు సామగ్రి దగ్ధమైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఫైర్ సేఫ్టీ ఎక్స్టింగ్విషర్స్ ఉండుంటే మంటలను త్వరగా ఆర్పేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు.

అంబులెన్స్ ఢీకొని బాలిక మృతి


నిఖిత (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: రోడ్డు దాటుతున్న ఓ బాలికను అంబులెన్స్ ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన ఓయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలం, ఖానాపూర్‌కు చెందిన పద్మ, శంకర్ దంపతుల కూతురు నిఖిత(18)తో కలిసి బతువుదేరువు నిమిత్తం నగరానికి వచ్చారు. ఈ నెల 14న మధ్యాహ్నం ఎన్‌జీఆర్‌ఐ వద్ద తల్లితో కలిసి రోడ్డు దాటుతుంది. అదే సమయంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో వేగంగా దూసుకొచ్చిన అంబులెన్స్ నిఖితను ఢీకొట్టడంతో తలకు తీవ్రంగా గాయమైంది. హుటాహుటిన అదే అంబులెన్స్‌లో గాంధీకి తరలించంగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తల్లి ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఓయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. మాణికేశ్వర్‌నగర్ కామన్ వద్దనున్న చెత్తకుండీ సమీపంలో ఈనెల 13న గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని వివరాలు సేకరించారు. 30-35 వయస్సు ఉండి మృతుడు తెల్లరంగు చొక్క, డార్క్ గ్రీన్ కలర్ పాయింట్ ధరించినట్లు పేర్కొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని వినతి

అంబర్‌పేట: ముదిరాజ్‌లను బీసీ-ఎ జాబితాలో చేర్చాలని లెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కలిసి రాష్ట్రంలో ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. చంద్రశేఖర్, సంతోష్, రాంచందర్, నవీన్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

వీరులకు వందనం



తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా (టాసా) ఆధ్వర్యంలో ఆర్మీ డే సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో స్టేషన్ కమాండర్ బ్రిగేడియర్ సోమశంకర్ వీర సైనిక స్తూపం వద్ద నివాళులర్పించారు. ఆర్మీడే కార్యక్రమంలో మిలటరీ బ్యాండ్ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. -రసూల్‌పురా

మళ్లీ కంటి వెలుగులు

- రేపటి నుంచి నిర్దేశిత కేంద్రాల్లో సేవలు ప్రారంభం
- ఏర్పాట్లు, సౌకర్యాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ


కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు



సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 18 నుంచి సరిగ్గా 100 రోజుల పాటు జరిగే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జీహెచ్ఎంసీ తగు ఏర్పాట్లు చేస్తోంది. ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో ఎనిమిది, బేగంపేట సర్కిల్ పరిధిలో మరో ఎనిమిది చోట్ల కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం ఆయా సర్కిళ్ల ఉప కమిషర్లు మోహన్‌రెడ్డి, ముకుందరెడ్డి ఆయా కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఏర్పాట్లపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

- ఒక్కో శిబిరంలో మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది వైద్య సిబ్బంది పని చేస్తారు. ఒక ఆప్టోమెట్రిస్ట్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు ఏఎన్ఎంలు, ముగ్గురు ఆశ వర్కర్లు, ఒక డీఈఓ ఉంటారు.
- ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కో శిబిరంలో రోజుకు 250 మందికి పరీక్షలు చేసే లక్ష్యంగా జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్య సిబ్బంది పని చేయాల్సి ఉంటుంది.
- కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభానికి ముందే రీడింగ్ గ్లాసెస్ సరఫరా చేస్తారు. పరీక్షలు చేసిన నెల లోపు ప్రిస్క్రిప్షన్ అద్దాల పంపిణీ జరుగుతుంది.
- స్థానికంగా ఉన్నవారందరికీ వైద్య పరీక్షల తంతూ పూర్తయ్యాక మరోచోట శిబిరాలను ఏర్పాటు చేస్తారు.
- నిర్దేశిత శిబిరాల ద్వారా కంటి పరీక్షలు చేయడం, అవసరమైన వారికి మందుల పంపిణీ, రీడింగ్ కళ్ల అద్దాలను అక్కడికక్కడే అందజేయడంతో పాటు ఇతర కంటి అద్దాలను తయారు చేసి ఇవ్వనున్నారు.
- శిబిరాల్లో పరీక్షల చేసిన వారికి నిర్దేశిత తేదీల్లో క్యాటరాక్ట్, ఇతర శస్త్ర చికిత్సలను చేయనున్నారు.
- యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల్లో కొనసాగే రోజువారీ సేవలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కంటి వెలుగును అమలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- అవసరాన్ని బట్టి వినియోగించుకునేలా ఒక శాతం బఫర్ టీమ్ (అడ్వాన్స్ టీమ్) ఏర్పాటు చేస్తున్నారు.

బేగంపేట సర్కిల్‌లో కేంద్రాలివే..

- బన్సీలాల్‌పేట డివిజన్ సీసీ నగర్, నవోదయ కమ్యూనిటీహాల్, హమాలీ బస్తీ.
- రాంగోపాల్‌పేట డివిజన్ విక్టోరియా గంజ్, గైనిక్‌బాగ్.
- బేగంపేట డివిజన్ పాటిగడ్డ మోడల్ మార్కెట్, బేగంపేట బస్తీ (ఓల్డ్ కస్టమ్స్ బస్తీ) కమ్యూనిటీ హాల్.
- మోండా డివిజన్ డొక్కాలమ్మ దేవాలయం.


కంటి వెలుగు సేవలు కొనసాగే సనత్‌నగర్ ఇండోర్ స్టేడియం

ఖైరతాబాద్ సర్కిల్‌లో..

- సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్ ఇండోర్ స్టేడియం, సుందర్‌నగర్ కమ్యూనిటీ హాల్, అల్లావుద్దీన్ కోఠి కమ్యూనిటీ హాల్.
- అమీర్‌పేట్ డివిజన్ గురుగోవింద్ సింగ్ ఇండోర్ స్టేడియం.
- సోమాజీగూడ డివిజన్ పరిధిలోని ఎంఎస్ మక్తా కమ్యూనిటీ హాల్, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్.
- ఖైరతాబాద్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లోని శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీ హాళ్లు.

పకడ్బందీగా అమలు



అంధత్వ రహిత తెలంగాణను ఆవిష్కరించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో మొదటి దఫాగా ఎనిమిది కేంద్రాలను ఎంపిక చేసి అన్ని రకాల కంటి వైద్య పరీక్షలను నిర్వహించనున్నారు. ఆయా కేంద్రాల్లో లక్ష్యం పూర్తయిన అనంతరం మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తాం.
-మోహన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ఖైరతాబాద్

సేవలను వినియోగించుకోవాలి



గతంలో జరిగిన మొదటి విడత కన్నా ప్రతిష్ఠాత్మకంగా మరోసారి కంటి వెలుగు ద్వారా అన్ని రకాల నేత్ర పరీక్షలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఆ మేరకు అన్ని బస్తీలు, కాలనీల వాసులు సద్వినియోగం చేసుకునేలా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని రకాల నేత్ర పరీక్షలు, మందులు, శస్త్ర చికిత్సలు చేస్తారు.
-ముకుందరెడ్డి, డిప్యూటీ కమిషనర్, బేగంపేట సర్కిల్

దిల్‌కి పసంద్.. ఉడి ఉడి పతంగ్


గాలి పటాలు ఎగురవేస్తున్న కొలను బాల్‌రెడ్డి


గాలిపటం ఎగరేస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం: సంక్రాంతి సందర్భంగా సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో మూడ్రోజుల పాటు ఉత్సాహంగా నిర్వహించారు. ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు. ప్రజాప్రతినిధులు, వయస్సు భేదం లేకుండా మిద్దెలపై డీజే పాటలతో గాలి పటాలు ఎగరవేస్తూ సందడి చేశారు.


నాయకులతో కలిసి గాలి పటాలను ఎగురవేసిన మాజీ కార్పొరేటర్

లాలాపేటలో కోడి పందేలు

- ఏపీ తరహాలో నగరంలో కోడి పందేలు
- పోలీసుల అదుపులో 8 మంది
- 12 కోళ్లు స్వాధీనం

అడ్డగుట్ట: ఏపీ తరహా నగరంలోనూ కొందరు కోడి పందేలకు పాల్పడుతున్నారు. లాలాపేటలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడి పందేలను అడ్డుడున్న పోలీసులు ముగ్గురు నిర్వాహకులతో పాటు మరో ఐదు మందిని అదుపులోకి తీసుకున్నారు. 12 పందేం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవీందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లాలాపేటలోని చంద్రబాబు నాయుడు నగర్(సీబీఎన్)లో ఆదివారం స్థానిక నాయకుడు కోళ్ల వెంకటేష్ యాదవ్, ఆనంద్, రవి కోళ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో లాలాగూడ పోలీసులు దాడులు నిర్వహించి పందేలను అడ్డుకున్నారు. నిర్వాహకులు కోళ్ల వెంకటేష్ యాదవ్, ఆనంద్, రవిలతో పాటు బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మరో 5 మందికి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 4,810 నగదు, 12 పందేం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం 8 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



ముషీరాబాద్: తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్‌లు హాజరై ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమల్‌పురి నందును సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బీజేపీని ప్రజలకు మరింత చేరువచేయాలని సూచించారు. ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బద్రినారాయణ, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఆయూష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి


బహుమతులను అందజేసిన హేమలత

బన్సీలాల్‌పేట్: ఆడ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని కార్పొరేటర్ హేమలత సూచించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన పాట్టి శ్రీరాములునగర్ బస్తీకి చెందిన జ్యోతి, సరితలకు సోమవారం ఆమె బహుమతులను అందజేసి మాట్లాడారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను ప్రొత్సహిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ప్రతి ఒక్కరు చదువుకునేలా బస్తీల్లోని పెద్దలు కృషి చేయాలన్నారు. చదువుతోనే పేదల జీవితాల్లో వెలుగు చూడగలమన్నారు. ఈ కార్యక్రమంలో శాంతికుమార్, సాయిరాజ్, వెంకటేష్

- ముగ్గుల పోటీల్లో గెలుపొందిన గడ్డం రిషితకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేఎం క్రిష్ణ బహుమతి అందజేశారు.

ఇంటి గ్రిల్స్ తొలగించి చోరీ

సనత్‌నగర్: తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బోరబండ సమీపంలోని స్నేహపురి కాలనీలో ఉంటున్న కిరణ్‌సాయి కక్ర, ఆయన భార్య రేఖ సంక్రాంతి పండుగ సందర్భంగా వరంగల్ వెళ్లారు. ఇంటి గ్రిల్స్ తాళం విరగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలోని సుమారు 10 తులాల బంగారు, వెండి వస్తువులు, కొంత నగదును తీసుకెళ్లారు. ఇంటి తలుపులు తెరచి ఉండటం గుర్తించిన పనిమనిషి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కవాడిగూడ: సెంట్రింగ్ కార్మికులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు గ్రేటర్ హైదరాబాద్ కాంట్రాక్ట్ అసోసియేషన్ (సెంట్రల్ కమిటీ) కృషి చేస్తోందని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, అధ్యక్షుడు కృష్ణ, చైర్మన్ ఎస్. పరశురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండీ చాంద్ పాషా, కోశాధికారి విష్ణువర్ధన్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం అసోసియేషన్ కార్యాలయంలో సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కేలండర్, డైరీని వారు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసోసియేషన్‌ను స్థాపించిన నాటి నుంచి సెంట్రింగ్ కార్మికుల అభివృద్ధికి పాటుపడుతుందని చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా కార్మికులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కార్యనిర్వహక కార్యదర్శి ప్రవీణ్, కరుణాకర్‌గౌడ్, మహ్మద్ అహ్మద్, మిర్జాషౌకత్‌బేగ్, నాయకులు నీలం, అర్జున్‌గౌడ్ తదితరులున్నారు.

నకిలీ పత్రాలతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడంటూ ఫిర్యాదు

సనత్‌నగర్: అద్దెకుంటున్న ఓ వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి ఇంటిని మరొకరికి విక్రయించాడంటూ తమకు న్యాయం చేయాలని ఆర్ఆర్ గోపాల్ కాంపౌండ్ జీపీఏ హోల్డర్ సుశీల్ కుమార్ అగర్వాల్ పోలీసులను ఆశ్రయించాడు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్రాహ్మణవాడీలోని ఆర్ఆర్ గోపాల్ కాంపౌండ్‌లో సుమారు 5,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో 45 పురాతన ఇళ్లు ఉన్నాయి. గత 50 ఏళ్లుగా ఆర్ఆర్ గోపాల్ కుటుంబ సభ్యులు ఈ ఇళ్లను అద్దెకు ఇచ్చి తద్వారా అద్దెను వసూలు చేసుకోవడం జరుగుతుందని ఇటీవల ఈ స్థలాన్ని డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కింద స్థల యజమాని తమకు అప్పగించడం జరిగిందన్నారు. ఇళ్లలో అద్దెకుటున్న వారికి ఖర్చులు చెల్లించి న్యాయబద్ధంగా స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అయితే ఇందులో నాలుగు ఇళ్లకు చెందిన వారు తాము పాల్ అనే వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేశామని పోలీసులను ఆశ్రయించారన్నారు. అద్దెకు ఉంటున్న వ్యక్తి తన కుటుంబ సభ్యులపై గిఫ్ట్‌డీడ్ చేయించుకుని, నకిలీ పత్రాలతో ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారనే విషయం బయటకు రావడంతో తాము పోలీసులతో పాటు న్యాయ స్థానాన్ని ఆశ్రయించామన్నారు. వారి డాక్యుమెంట్లలో సర్వే నెంబర్ గానీ, లింక్ డాక్యుమెంట్ గానీ లేకుండా స్థల యజమానికి తెలియకుండా రిజిస్ట్రేషన్ చేశారని నకిలీ పత్రాలతో అక్రమంగా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రమాదకరం.. పట్టించుకోరేం!




మెట్టుగూడ డివిజన్ ఆలుగడ్డబావి హనుమాన్‌టెంపుల్ వద్ద స్ట్రీట్‌లైట్ల కోసం ఏర్పాటు చేసిన ఫ్యూజ్, మీటర్ బాక్సులు ప్రమాదకరంగా మారాయి. బాక్స్‌లు పగిలిపోవడంతో విద్యుత్ తీగలు నేలకు తాకేలా వేలాడుతున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు పొరపాటున వాటికి తగిలితే ప్రాణనష్టం జరిగే ప్రమాదముందని పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ఫ్యూజ్ బాక్సులను సరిచేయాలని కోరుతున్నారు. -సికింద్రాబాద్

ఇళ్లు ఇచ్చారు.. నీళ్లు మరిచారు

- తాగునీటికి తంటాలు పడుతున్న సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ వాసులు
- దృష్టి సారించని అధికారులు, ప్రజాప్రతినిధులు


సిల్వర్ కాంపౌండ్ గృహ సముదాయం


డబుల్ బెడ్రూమ్‌ల సమీపంలోని ఓ కుళాయి వద్ద పోటీపడి నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు రెండవ వార్డు సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ సముదాయంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. 16 నెలల క్రితం ఆరు బ్లాక్‌లలో 168 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించిన ప్రభుత్వం, అధికారులు త్వరలో ప్రతి ఇంటికి తాగునీటి వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ.. ఇప్పటి వరకు అమలు కాకపోవడంతో కేవలం బోరు నీటిపైనే ఆధార పడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయమై పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా కేవలం హామీలతోనే సరిపెడుతున్నారే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- డబుల్ బెడ్రూమ్‌లను జీప్లస్ త్రీ పద్ధతిన నిర్మించడంతో పై బ్లాక్‌లో ఉంటున్న వారు తాగునీటి కోసం కిందికి దిగి పక్కబస్తీకి వెళ్లి బిందెలు మోసుకుంటూ అతికష్టం మీద మూడంతస్తులు ఎక్కాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సంవత్సరం క్రితం హంగు ఆర్భాటాలతో 28 లక్షలతో ప్రధాన తాగునీటి పైపులైను పనులు ప్రారంభించి ఇక తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తామని ఉపన్యాసాలు ఇచ్చిన నేతలు ఆ దిశగా ఏలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రధాన పైపులైను అభివృద్ధి చేసి సంప్‌కు కనెక్షన్ ఇచ్చారు. కాని ఇప్పటి వరకు అందులో తాగు నీటిని వదిలిన పాపాన పోలేదని బావురుమంటున్నారు.

అమలు కాని నిర్ణయాలు..

- నియోజకవర్గ ఎమ్మెల్యే సాయన్న, బోర్డు వాటర్‌వర్క్స్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రెండు పర్యాయాలు సమావేశం ఏర్పాటు చేసి చర్చించినప్పటికి తీసుకున్న నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమతున్నాయి.
- పై అంతస్తుల్లో సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేసి బ్లాకుల్లోని ప్రతి ఇంటికి నీటి కనెక్షన్ ఇవ్వాలని సంప్ ద్వారా సింటెక్స్ ట్యాంకుల్లోకి తాగునీటిని పంపింగ్ చేయాలని ఓ సమావేశంలో నిర్ణయించారు.
- సాంకేతిక కారణాలు చూపుతూ రెండోసారి ప్రతి బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ వద్దే ప్రతి ఇంటికి సంబంధించిన తాగునీటి కనెక్షన్ ఇచ్చి ఇక్కడి నుంచే తాగు నీటిని పైకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.
- ఈ నిర్ణయాల్లో ఏ ఒక్కటి అమలుకు నోచుకోకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తహతహలాడాల్సి వస్తోంది.
- వేసవి ప్రారంభం కానున్న నేపథ్యంలో తాగునీటిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

త్వరలోనే కనెక్షన్లు ఇస్తాం..

నగరంలో డబుల్ బెడ్రూమ్‌ల సముదాయం వద్ద ఏ విధంగా తాగునీటి కనెక్షన్లు ఇచ్చారో అదే విధంగా సిల్వర్ కాంపౌండ్ వద్ద కూడా అదే విధంగా ఇచ్చేలా త్వరలో పనులు చేపడతాం. పనులు పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికీ ఉదయం బోర్వెల్ నీరు, సాయంత్రం తాగునీటి సరఫరా చేసేలా ఏర్పాటు చేస్తాం.
-రాజ్‌కుమార్, వాటర్‌వర్క్స్ సూపరింటెండెంట్